క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మైహోం మంగళ పరిసరాలు, శిల్పావ్యాలీ, సెంట్రల్ పార్క్, కాంతివనం, హెచ్‌ఏఎల్ లేఅవుట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుపాద టౌన్‌షిప్, మసీద్‌బండ విలేజ్, మసీద్‌బండ క్రాస్ రోడ్, లగ్జర్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చందానగర్ పరిధిలో...

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్‌ఐజీ, మంజీరా పైపులైన్‌రోడ్, మైత్రినగర్ ఫేజ్-1,2,3, ప్రకాష్‌నగర్, వినాయక్‌నగర్, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సాయిరాం టవర్స్, వైశాలినగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ల్యాండ్‌మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్, నిమ్మా అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు.

పీజేఆర్ ఫీడర్ పరిధిలో.. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలికాంనగర్, ఎన్‌టీఆర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, తాజ్‌నగర్, గోపన్‌పల్లి తండా, సోఫా కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెలికాంనగర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ , డైమండ్ హిల్స్ గోపన్‌పల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 11 కేవీ దూబేకాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఆదర్శనగర్, దూబే కాలనీ, నెహ్రూనగర్, గోపీనగర్, సురభి కాలనీల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

◆ 11 కేవీ పాపిరెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు భాగ్యలక్ష్మీ కాలనీ ఏరియా.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ డోయన్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని డోయన్స్ కాలనీలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: హైదర్‌నగర్, నందమూరినగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జై భారత్‌నగర్, బృందావన్ కాలనీ అదే విధంగా.. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నందమూరినగర్, హైదర్‌నగర్ విలేజ్, గౌతమీనగర్, శ్రీనివాస కాలనీ, లేక్ వ్యూ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఓటుపై అవగాహన.. 5కె రన్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్లను చైతన్యపర్చేందుకు ఈ నెల 19వ తేదీ 5కె రన్‌ను నిర్వహించనున్నట్లు శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నియోజకవర్గ ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు మల్కంచెరువు నుంచి 5కె రన్ గచ్చిబౌలి స్టేడియం వరకు కొనసాగుతుందన్నారు. ఈ రన్‌లో ఓటర్లు, యువకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'డాటలింగ్' కార్యాలయం ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సైబర్ గేట్‌వేలో యూఎస్ బేస్డ్ కంపెనీ డాటలింగ్ మొదటి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. పూర్తి స్థాయిలో హెల్త్‌కేర్ టెక్నాలజీ అందిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డాటలింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకర్ చిలకమర్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు.. ప్రత్యేక డ్రైవ్

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించనున్నామని, ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ యువజన నాయకులు ప్రవీణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించనున్నామన్నారు. ఆసక్తి గల యువకులు మరింత సమాచారం కోసం తమను సంప్రదించాలని కోరారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి.గురువారం తొమ్మిదిమందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 08 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

'సీఆర్' ఎక్స్‌లెన్స్

- మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణ కోర్సులు
- ఔషధ మొక్కల పెంపకం కూడా...
- కనీస రుసుముతో పేదలకు వైద్య పరీక్షలు


మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ వనశ్రీ (ఫైల్)


మహిళలకు శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధులు, మహిళలు, నిరుపేదలకు చేయూతనందిస్తుంది. ఫౌండేషన్‌లో మహిళల వెల్ఫేర్ సెంటర్, స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ, హెల్త్ సెంటర్, కంటి పరీక్షలు, లైబ్రరీ, సమావేశం మందిరాలు, కమ్యూనిటీహాల్, సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ వంటివి అందుబాటులో ఉన్నాయి. దాంతో పాటు వృద్ధుల ఆరోగ్యం కోసం అనేక ఔషధ మొక్కలతో పాటు కూరగాయలు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రంలో వార్డులు కూడా ఏర్పాటు చేశారు.

మహిళలకు ప్రత్యేక శిక్షణ...

బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు. సీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటి వరకు 10వేల మంది మహిళలు లబ్ధి పొందినట్లు సభ్యులు తెలిపారు.

పేదలకు వైద్యం..

నిరుపేదలకు సీఆర్ ఫౌండేషన్‌లో ప్రత్యేక ప్రాథమిక ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కంటి వైద్య పరీక్షలను రూ.30కే అందించడంతో మంచి స్పందన వస్తుంది. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకొని గత సంవత్సరం నుంచి కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు సీఆర్ ఫౌండేషన్ సభ్యులతో పాటు పక్కనున్న బస్తీలు వాసులు కూడా సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు..

వృద్ధులు కదల్లేని స్థితిలో ఉన్న వారికి సీఆర్ ఫౌండేషన్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ప్రాథమిక చికిత్సకు వైద్యులను అందుబాటులో ఉంచారు. మంచానికే పరిమితమయ్యే వృద్ధులకు 24 గంటలు నర్సింగ్ సర్వీస్ కూడా అందుబాటులో ఉంచారు. ఇందులో ఆరు పడకలను ఏర్పాటు చేశారు. ఇక సీఆర్ ఫౌండేషన్‌లో ఖాళీ స్థలాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దేందుకు ప్రగతి రిసార్ట్స్ అధినేత డాక్టర్ డీవీకె రావు సౌజన్యంతో పలు రకాల ఔషధ మొక్కలు, పూల మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు...

గత 15 సంవత్సరాలు మహిళల సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న వారికి సామాజిక చైతన్యం కలిగించడంలో సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యుల కృషి వల్ల సోషల్ ప్రోగ్రెస్ నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ కేంద్రానికి 2020 ఎక్సెలెన్స్ అవార్డు దక్కింది. రాష్ట్ర మంత్రి కెటీఆర్ చేతుల మీదుగా ఫౌండేషన్ కన్వీనర్ వనశ్రీ అందుకున్నారు.

యాంపీ థియేటర్ ఏర్పాటు..

సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో నివాసముండే మల్లంపాటి మురళీ, మల్లంపాటి వెంకటేశ్వరరావులు తమ సొంత డబ్బులతో నూతనంగా దాసరి నాగభూషణం పార్కులో వాకింగ్ ట్రాక్, సీఆర్ కళాక్షేత్రంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లను నిర్మించారు. ఈ రెండింటిని ఇటీవల ప్రారంభించారు. వృద్ధులకు ఉదయం, సాయంత్రం సరదాగా నడవాలన్నా, కాసేపు కూర్చొని నాటకాలు చూడడానికి బాగుంటుంది.


కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్


సీఆర్ ఫౌండేషన్‌లోని యాంపీ థియేటర్

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్ జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీలలో వెలగని వీధి దీపాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ ఏఈ రామ్మోహన్‌రావు, ఈఈ ఎస్‌ఎల్ శంకర్, ప్రాజెక్టు ఇంజనీర్ హరికృష్ణ, సూపర్‌వైజర్ శ్రీనివాస్, శివశంకర్‌రెడ్డి, ఖలీల్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

రహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి అతిక్‌ఉల్ రహమాన్‌కు గురువారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీ అరబిక్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తల్హా ఫర్హాన్ పర్యవేక్షణలో 'షేక్ అబుల్ హసన్ అలీ నద్వీ రచించిన 'ది బుక్ అల్ సీరహ్ అన్ నబవియా'-ఒక విశ్లేషణాత్మక, వివరణాత్మక అధ్యయనం' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం


అన్నారంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, అనంతారం, దోమడుగు, గుమ్మడిదల గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే లక్ష్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ కేంద్రంలో డయాగ్నొస్టిక్ కేంద్రం అందుబాటులో ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అన్నారంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేయిస్తున్న శివాజీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ ఫంక్షన్‌హాల్ నిర్మించాలి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన మైనార్టీ నాయకులు


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్, మైనార్టీ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముస్లింలకు మైనార్టీ ఫంక్షన్‌హాల్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ గురువారం కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మైనార్టీలకు ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే అర్హులైన వారికి డబుల్ ఇళ్లు కేటాయించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ప్రత్యేక ఫంక్షన్ హాల్ నిర్మాణం, ముస్లింల శ్మశానవాటికల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హబీబ్, మహ్మద్ బేగ్, అక్తర్, ఖాసీమ్, అష్రాఫ తహిర్, అక్బర్, జమీర్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ ,పార్టీ నాయకులు

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కే.నరేష్, నియోజకవర్గ కో కన్వీనర్ మణిభూషన్, సీనియర్ నాయకులు కె.ఎల్లేష్, రాధాకృష్ణయాదవ్, వెలగ శ్రీను, కృష్ణ ముదిరాజ్, రాజుశెట్టిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ ఇళ్లు ఇస్తామని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గానికి 5 వేల ఇళ్ళు ఇస్తామన్న సర్కార్ శేరిలింగంపల్లిలో కేవలం 344 మాత్రమే నిర్మించిందన్నారు. పథకాలన్నీ బీఆర్‌ఎస్ నాయకులకే తప్ప, అర్హులకు అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులందరికి బీసీ బంధు ఇవ్వడంతో పాటు దరఖాస్తు చేసుకున్న అర్హులకు పెన్షన్, రేషన్ కార్డులను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదనాచారీ, నర్సింగరావు, హనుమంత్‌నాయక్, నరేందర్ ముదిరాజ్, మనోహర్, కృష్ణంరాజు, శివాసింగ్, వరలక్ష్మీ, చంద్రమోహన్, రాజేందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకోరులను తరిమికొట్టాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్‌యాదవ్


హఫీజ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: కబ్జాకోరులు రాజ్యమేలుతున్నారని, అక్రమార్కులను తరిమికొట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్రలో భాగంగా హఫీజ్‌పేట్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ బీజేపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ అనూషా, మహేష్ యాదవ్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మణ్, రవిగౌడ్, అశోక్, బాబు ముదిరాజ్, మంజుల, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అతి వేగం.. ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

- ఫ్లైఓవర్ గోడను ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ యువతి మృతి



మరణించిన స్వీటిపాండే, ధ్వంసమైన స్కూటీ

మాదాపూర్: హైటెక్‌సిటీ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై స్కూటీ అదుపుతప్పిన ఘటనలో ఓ యువతి మరణించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎన్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్ కలకత్తాకు చెందిన స్వీటిపాండే(22)సికింద్రాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్‌లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. తన స్నేహితుడు రాయన్ ల్యాకే ఇద్దరు కలసి స్కూటీపై ఉదయం 4 గంటల సమయంలో జేఎన్‌టీయూ కూకట్‌పల్లి నుంచి ఐకియా వైపు అతివేగంగా, వెళుతూ ఓవర్ ప్రొటెక్షన్ వాల్‌కు గుద్దుకుని పడిపోయారు. వెనుక కూర్చుని ఉన్న స్వీటి పాండే ఫ్లైఓవర్ పై నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇద్దరిని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. స్వీటీ పాండే చికిత్స పొందుతూ 9.20 నిమిషాలకు చనిపోయినట్టు డాక్టర్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసును మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్తు పట్టణ ప్రణాళికలో ఏఐ కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్

రాయదుర్గం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పట్టణ ప్రాంత పునర్నిర్మాణం, ప్రణాళిక మార్పునకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతో అవసరమని ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్ పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ›ఏఐ- ఎనేబుల్డ్ అర్బన్ ప్లానింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఫర్ క్లైమేట్ అడాప్టేషన్‹ అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి, రవాణా ప్రణాళిక, వాతావరణ మార్పుల కోసం అనుసరణ ప్రణాళిక, పట్టణ ప్రణాళికలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చంద్రమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.7 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను చేపట్టామని నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై నీరు నిల్వకుండా లెవెలింగ్‌తో నిర్మాణం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్, వెంకటేష్, సాయిగౌడ్, కిరణ్, లింగయ్య, రమేష్, ఆనంద్, మనెమ్మ, మల్లీశ్వరి, సుజాత, శివమ్మ, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

మనూలో రెండ్రోజుల సదస్సు ప్రారంభం


ప్రొ.హబీబ్‌కు మౌలానా ఆజాద్ చిత్రపటాన్ని అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: రాజకీయాలు మతానికి గుడ్డిగా కట్టుబడి ఉండటాన్ని మౌలానా ఆజాద్ వ్యతిరేకించారని న్యూఢిల్లీ ఎన్‌యూఈపీఏ మాజీ మౌలానా ఆజాద్ చైర్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ (ఎంసీజే) సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల సమావేశం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సహ జీవనం, శాంతిని పెంపొందించే ప్రతి మతాన్ని గౌరవించాలంటూ మౌలానా చేసిన కృషిని ఆయన వివరించారు. కొలంబియా యూనివర్సిటీ ఎర్లీకెరీర్ ఫెలో డాక్టర్ షాన్నారోడ్రిగ్స్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్‌ను రాజకీయ ఆలోచనాపరుడుగా అభివర్ణించారు.

స్టార్ ఆస్పత్రిలో 'ఇల్యూమినా' ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో డీఐజీ సుమతి, డాక్టర్లు

రాయదుర్గం: అందానికి సొబగులద్దే 'ఇల్యూమినా'ను నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ మహిళా భద్రతా విభాగం డీఐజీ సుమతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటన్నింటిని రోగులకు అందుబాటులోకి తీసుకురావడంతో హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో అధునాతన అవకాశాలను స్టార్ ఆస్పత్రులలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫేస్‌లిఫ్ట్ నుంచి బ్రెస్ట్ రిడక్షన్, హ్యాండ్ సర్జరీ, బర్న్స్, ట్రామా, పోస్ట్ బెరియాట్రిక్, ట్రీట్‌మెంట్స్, సర్జరీలతోపాటు నాన్ సర్జికల్ చికిత్సలను పొందాలంటే యూరప్, అమెరికా వంటి దేశాలకు వెళ్ళాల్సి వచ్చేదని ప్రస్తుతం ఈ టెక్నాలజీని స్టార్ ఆస్పత్రిలో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌వాసు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను విడుదల చేసిన హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తదితరులు

25న స్పోర్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: క్రీడాకారులకు కావాల్సిన అన్ని వస్తువులు స్పోర్ట్స్ ఎక్స్‌పోలో ఉంటాయని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ బిజినెస్ సెంటర్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా 2023కి సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నుండి మల్లాఖంబ్, బాక్స్ క్రికెట్, సైక్లోథాన్, బాడీ బిల్డింగ్ వరకు ఎక్స్‌పోలో కావాల్సిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఉంటుందని ఉదయం 9గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రవేశం ఉచితమని తెలిపారు.

ఉత్సాహంగా 'మేరుత్సవ్-2023'

పాల్గొన్న 65 పాఠశాలల విద్యార్థులు

హఫీజ్‌పేట్: మేరుత్సవ్-2023 ఇంటర్ స్కూల్ కాంపిటేషన్ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన పోటీలలో నగరంలోని 65 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు విభాగాలలో 85 రకాల పోటీలలో 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 'జీ-20 సమ్మిట్ ఒకటే భూమి, ఒకటే కుటుంబం, ఒకటే భవిష్యత్తు' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నృత్యం, సంగీత ప్రదర్శన, గణిత, విజ్ఞాన పోటీలలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చాటారు. ప్రిన్సిపల్ సాత్యకి బెనర్జీ మాట్లాడుతూ కళ, సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి ఎన్నో సవాళ్లతో కూడిన పోటీలలో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారన్నారు.


